37 మందికి 'లానేస్తం' సాయం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కొత్తగా లాగ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన యువ లాయర్లు వత్తిలో నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం వైఎస్సార్ లానేస్తం ద్వారా ఆర్థిక ప్రోత్సాహాన్ని అందజేస్తోందని జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య పేర్కొన్నారు. సోమవారం నాడు కలెక్టరేట్‌లో వైఎస్ఆర్ లా నేస్తం పథకం ద్వారా అర్హులైన జూనియర్ న్యాయవాదులకు ఆర్థిక సాయాన్ని 37 మందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా అర్హులైన 37 మంది యువ న్యాయవాదులకు రెండవ విడతలో భాగంగా తొలిసారి ఒక్కొక్కరికి 5000 చొప్పున యువ న్యాయవాదుల ఖాతాల్లో జమ చేశారన్నారు. అర్హులైన యువ న్యాయవాదులు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చారని వారికి ఆర్థిక సహాయ పత్రాలను అందజేస్తున్నామన్నారు. గ్రామ వార్డు సచివాలయాల కోఆర్డినేటర్ శివారెడ్డితో కలిసి డిఆర్ఓ లబ్ధిదారులకు మంజూరైన ఆర్థిక సహాయం పత్రాలను అందజేశారు. ఈ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు పాల్గొన్నారు.

కేంద్ర కరువు బృందం కరుణించేనా ?

నేడు, రేపు అనంత, సత్యసాయి జిల్లాల్లో పర్యటన

కేంద్ర బృందం పర్యటనపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఈ ఏడాది ఖరీఫ్‌లో నెలకొన్న కరువు పరిస్థితులను పరిశీలించేందుకు కేంద్ర కరువు బృందాలు ఉమ్మడి అనంతపురం జిల్లాకు విచ్చేయనున్నాయి. సోమవారం రాత్రికే అనంతపురం చేరుకున్న బృందాలు మంగళ, బుధవారాల్లో అనంతపురం, సత్యసాయి జిల్లాలో పర్యటించ నున్నాయి. బృందం సభ్యులు వర్షాభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించ నునన్నారు. ఇప్పటికే బృందాల పర్యటనకు సంబందించి రూట్ మ్యాప్‌లు ఖరారయ్యాయి. కేంద్ర బృందం తొలిరోజు మంగళవారం నాడు అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీ పంకజ్ నేతృత్వంలో కరువు బృందం కరువు పరిశీలన చేయనుంది. పదిమంది సభ్యులు ఈ బృందంలో ఉన్నారు. మూడు బృందాలుగా విడిపోయి ఈ బృందం పర్యటన చేయనున్నట్టు సమాచారం.

కేంద్ర కరువు బృందం కనికరించేనా ?

కరువు ప్రకటనలు వెలువడిన ప్రతిసారీ బృందాలు పర్యటించడం, వెళ్లడం సర్వసాధారణమైన అంశంగా ఉంటోంది. సాయం మాత్రం నామమాత్రంగానే ఉంటోందన్న విమర్శ ఉంది. ఈసారి పర్యటించే బృందం ఏ మేరకు కరుణిస్తుందన్నది చూడాల్సి ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకు చూసుకున్నా వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. అనంతపురం జిల్లాలో 36 శాతం వర్షపాతం లోటుండగా, సత్యసాయి జిల్లాలో 30 శాతం వర్షపాతం లోటుంది. ప్రధానంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం జులై, ఆగస్టు మాసాల్లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు అనంతపురం జిల్లాలో నెలకొన్నాయి. వంద ఏళ్లలో ఎప్పుడూ లేనంత తక్కువ వర్షపాతం ఈసారి ఆగస్టులో నెలకొంది. సాధారణ వర్షపాతం ఆగస్టు నెలలో 83.3 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 13.7 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. 83.7 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. వందేళ్లలో ఇంత తక్కువ వర్షపాతం ఆగస్టులో నమోదవడం ఇదే ప్రథమం. ఖరీఫ్ పంటల సాగుకు కీలకమైన ఆగస్టులో వర్షాభావం మూలంగానే ఉమ్మడి అనంతపురం జిల్లాలో పంటల సాగుపై తీవ్ర ప్రభావం పడింది. వేసిన పంటలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. అనంతపురం జిల్లా సాధారణ సాగు 9.66 లక్షల ఎకరాలకుగానూ 6.34 లక్షల ఎకరాల్లోనే సాగైంది. సాధారణ సాగులో ఇది 67 శాతమే కావడం గమనార్హం. సత్యసాయి జిల్లాలో మరింత తక్కువ సాగైంది. 7.12 లక్షల ఎకరాలకుగానూ 2.58 లక్షల ఎకరాల్లోనే విత్తనం పడింది. అంటే సాధారణ సాగులో 35 శాతమే పంటలు సాగయ్యాయి. ఇందులో ప్రధాన పంట వేరుశనగ పూర్తిగా దెబ్బతింది. అనంతపురం జిల్లాలో 2.28 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగవగా, సత్యసాయి జిల్లాలో కేవలం 1.77 లక్షల ఎకరాల్లోనే సాగైంది. ఈ పంట సాగుకు ఎకరానికి రూ.40 వేల వరకు ఖర్చు రాగా రైతుకు దక్కిన ప్రతిఫలం రెండు బస్తాల విత్తనకాయలు కూడా రాలేదు. దీంతో పూర్తిగా రైతులు నష్టపోయి ఉన్నారు. పత్తి ఆముదం తదితర పంటల పరిస్థితి కూడా ఇదే తీరుగా ఉంది.

ఇప్పటికే అంచనాలు

పంటనష్టంపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అంచనాలను రూపొందించింది. అనంతపురం జిల్లాలో రూ.251 కోట్లు నష్టం వాటిల్లినట్టు అంచనాలు రూపొందించి రాష్ట్రప్రభుత్వానికి నివేదించింది. ఇవి కాకుండా తాగునీటి కష్టాలు, కరువు సమయాల్లో వలసలు పోకుండా ఆదుకునే చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. వీటన్నింటికీ ఎన్ని నిధులు అవసరమవుతాయన్న ప్రతిపాదనలను జిల్లా యంత్రాంగం కరువు బృందం ముందు ప్రతిపాదించేందుక సిద్ధమైంది. నేడు జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం జరిగే సమీక్షల్లో కరువు బృందం ముందు అధికారులు ప్రతిపాదించనున్నారు.

సోమందేపల్లి పోలీసు స్టేషన్ ఎదుట పేదలతో కలిసి రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు

అడ్డగింతలు..అరెస్టులు..!

- పేదల భూస్వాధీన పోరాటంపై పోలీసుల జులుం
- ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు, పేదల అరెస్టు
- అధికారుల తీరుపై సిపిఎం ఆగ్రహం

ప్రజాశక్తి-గోరంట్ల, సోమందేపల్లి

సొంతిళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలని కోరిన వారిపై పోలీసులు జులుం ప్రదర్శించారు. శాంతియుతంగా నిరసన ర్యాలీ చేపట్టిన వారిని అడ్డగించారు. పేదలకు మద్దతు తెలిపిన సిపిఎం నాయకులను బలవంతంగా అరెస్టులు చేశారు. గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, వ్యకాసం ఆధ్వర్యంలో గత పది రోజులుగా భూస్వాధీన ఉద్యమం జరుగుతోంది. పట్టాలు ఇస్తామని అధికారులు ప్రకటించడం మినహా ఆచరణలో దానిని అమలు చేయడం లేదు. దీంతో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నాడు పేదలు తహశీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీకి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా గోరంట్ల బస్టాండ్ నుంచి దాదాపు 200 మంది పేదలు తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీకి సిద్ధం అయ్యారు. ఈ ర్యాలీలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ ప్రారంభం అవగానే గోరంట్ల సిఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పోలీసులు చుట్టుముట్టారు. ఎక్కడివారిని అక్కడ బలవంతంగా అరెస్టు చేసేందుకు ఉపక్రమించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, పెద్దన్న, సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, హనుమయ్య, వెంకటేశులును చుట్టిముట్టి అరెస్టు చేశారు. ఈ సమయంలో వీరిని అరెస్టు చేయనీయకుండా పేదలు అడ్డుపడ్డారు. వారిని పక్కడకు ఈడ్చేసి సిపిఎం నాయకులను బలవంతంగా అరెస్టు చేసి గోరంట్ల పోలీసు స్టేషన్‌కు తరలించారు. తాము పేదలమని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అధికారుల వద్దకు వెళ్తున్నాం.. అనుమతివ్వాలని వేడుకున్నా పోలీసులు కనకరించకుండా అరెస్టులకు తెగబడ్డారు. పోలీసుల తీరును నిరసిస్తూ పేదలు పోలీసు స్టేషన్ వద్దకెళ్లి నిరసన తెలిపారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళన కొనసాగుతుండగానే సిపిఎం నాయకులను గోరంట్ల పోలీసు స్టేషన్ నుంచి సోమందేపల్లి స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు వారిని స్టేషన్‌లో ఉంచుకుని అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

పట్టాలివ్వమంటే అరెస్టులు చేస్తారా..?
సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

'పాలసముద్రం గ్రామంలో పేదలకు పట్టాలు ఇవ్వాలని గత మూడు నెలలుగా అధికారులందరినీ కోరుతున్నాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. సమస్యను తహశీల్దార్‌కు తెలుపుదామని శాంతియుతంగా నిరసన ర్యాలీ చేస్తుంటే పోలీసులు అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసం' అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ ప్రశ్నించారు. అరెస్టు సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు నెలల నుంచి ఇళ్ల స్థలాల కోసం వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం విచాకరం అన్నారు. పాలసముద్రం సమీపంలో పేదలకు ఇళ్ల పట్టాల కోసం స్థలాన్ని కేటాయించి, ఆ తరువాత అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు వాటిని ఇవ్వకుండా అధికారులు కావాలనే అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. పేదలకు న్యాయం చేయాల్సిన అధికారులే ఇలా అన్యాయంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. పట్టాలు ఇస్తామని హామీ ఇవ్వడం తరువాత దాని గురించి పట్టించుకోకుండా మర్చిపోవడం పరిపాటిగా మారిందన్నారు. ఇప్పుడు ఏకంగా అరెస్టులు, కేసులు అంటూ అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అరెస్టులు, కేసులతో ఉద్యమాన్ని ఆపలేరని, ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ పేదలకు పట్టాలు ఇచ్చేంత వరకు భూస్వాధీన పోరాట స్థలంలోనే పేదలతో కలిసి గుడిసెలు వేసుకుని నివాసం ఉంటామన్నారు. రెండు రోజుల్లోపు సమస్య పరిష్కారం కాకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ గంగాధర్, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు కొండా వెంకటేష్, మాబు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, రమణ, పేదలు పాల్గొన్నారు.

గోరంట్ల పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న పేదలు

అరెస్టు అనంతరం గోరంట్ల పోలీసు స్టేషన్‌లో ఉన్న సిపిఎం నాయకులు

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకొద్దాం

ప్రజాశక్తి - పరిగి

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చి రానున్న ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇచ్చే విధంగా పనిచేయాలని ఏఐసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు కెటి. శ్రీధర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సేవామందిర్ లోని ఆయన నివాసంలో మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే కీలకమని వారు శక్తివంతన లేకుండా కృషి చేస్తే రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని దక్కించుకునే అవకాశం ఉందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి పార్టీని బలోపేతం చేసి 2024 ఎన్నికలకు సంసిద్ధం కావాలని అన్నారు. ఇటీవల కాలంలో తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపట్టిందనివీటిని స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఈశ్వరప్ప, భాస్కర్ రెడ్డి రామాంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎఐసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు కెటి. శ్రీధర్

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న అమ్యూనిటీ సెక్రటరీలు వారి సచివాలయాల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కమిషనర్ తన చాంబర్ లో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణతో కలిసి సచివాలయ అమ్యూనిటీ సెక్రటరీలు, మున్సిపల్ ఎఇ, డిఇతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే గుత్తేదారులు చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఎం బుక్ రికార్డు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. దీంతో పాటు సచివాలయ పరిధిలో ప్రజా అవసరాల నిమిత్తం అభివృద్ధి పనులను గుర్తించాలని, దానికి సంబంధించి ఎస్టిమేషన్లు సైతం సిద్ధం చేయాలని అన్నారు. ప్రతి ఇంటికి కొళాయి కనెక్షలను పరిశీలించి, అక్రమ కొళాయి కనెక్షలను సక్రమం చేయాలన్నారు. అందరికీ ఇల్లు పథకంలో భాగంగా ఇప్పటికే ఎంపిక చేసిన లబ్ధిదారుల గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసుకునే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్లు బాలసుబ్రహ్మణ్యం, వాణి, ఎఇలు నాగేంద్ర జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి కదిరి అర్బన్

అభివృద్ధి, సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే సిద్దారెడ్డి పేర్కొన్నారు. మండలం పరిధిలోని తుమ్మల ఆర్ అండ్ బి రోడ్డు నుండి దిన్నె మీదపల్లి మీదుగా కుమ్మరోళ్లపల్లి వరకు రూ. 91.5 లక్షలతో నిర్మించిన సిమెంట్ కాంక్రీట్ రోడ్డును ఎమ్మెల్యే సిద్దారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా నిర్మాణానికి నోచుకోని సిమెంట్ కాంక్రీట్ రోడ్డును వైసిపి హయాంలో నిర్మించుకున్నామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 100 సంవత్సరాలు మన్నిక కలిగిన నియోజకవర్గ వ్యాప్తంగా 135 గ్రామాలకు అప్రోచ్ రోడ్లను వేసుకోగలగామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రనిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోడల్ టెస్ట్ పేపర్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కొత్తచెరువు :

వచ్చే ఏడాది మార్చిలో పదవ తరగతి రాసే విద్యార్థులు యుటిఎఫ్ వారు అందించిన మోడల్ పేపర్లను సద్వినియోగం చేసుకోవాలని డిఇఓ మీనాక్షి, కోరారు. స్థానిక డిఇఓకార్యాలయం ఆవరణంలో ఆమెతోపాటు యుటిఎఫ్ జిల్లా నాయకులు జయచంద్రా రెడ్డి, సుధాకర్ తదితరులు మోడల్ పేపర్లను ఆవిష్కరించారు ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం 25 సంవత్సరాల అనుభవం గల యుటిఎఫ్ ఉపాధ్యాయుల చేత పదవ తరగతి మోడల్ పేపర్లను రూపొందించడం అభినందనీమన్నారు. ఈ ప్రశ్న పత్రాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గత ఏడాది జరిగిన పదవ తరగతి పరీక్షల్లో వీరు రూపొందించిన ప్రశ్నాపత్రాల నుండి 70 మార్కులకు పైబడి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో కార్యాలయ ఎడి నాగరాజు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ లాజర్, ఎంఇఓ 2 జయచంద్ర, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, జిల్లా కార్యదర్శి శివశంకర్, లక్ష్మీనారాయణ, బాబు, శివయ్య, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండండి

ప్రజాశక్తి - పరిగి

ర్యాగింగ్ కు దూరంగా ఉండిఉన్నతమైన లక్ష్యంతో విద్యను అభ్యసించాలని పరిగి ఎస్ఐ నరేంద్ర విద్యార్థులకు పిలుపునిచ్చారు. సోమవారం పరిగి మండలంలోని విద్యానిధి జూనియర్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్, దిశా యాప్ వినియోగం, విద్యార్థులపై వేధింపు నిర్మూలన వంటి అంశాలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా అడుగులు వేయాలని కోరారు.కళాశాలలో విద్యార్థులను వేధించడం ర్యాగింగ్ కు పాల్పడడం, విద్యార్థులు చెడు అలవాట్లకు పాటుపడటం వంటి వాటిని విడనాడి లక్ష్యం దిశగా పయణించాలన్నారు. ప్రభుత్వం విద్యార్థినులకు రక్షణ కవచంలా దిశ యాప్ ను రూపొందించిందని అవసరమైన సమయంలో ఈ యాప్ ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశంలో 2,43,237 పోక్సో కేసులు పెండింగ్

పజాశక్తి కదిరి అర్బన్

దేశంలో 2, 43,237 పోక్సో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని రెడ్స్ అధ్యక్షురాలు భానుజా అన్నారు. సోమవారం స్థానిక రెడ్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా చిన్న పిల్లలపై జరుగుతున్న లైంగిక పెండింగ్ కేసులో వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న పోక్సో కేసులను క్లియర్ చేయడానికి సుమారు 11 సంవత్సరాలు పడుతుందన్నారు. బాలలపై లైంగిక వేధింపుల బాధితులకు న్యాయం చేసేందుకు ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలని 2019లో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నప్పటికీ, ప్రభుత్వం ఏటా కోట్లలో నిధులు వెచ్చిస్తున్నప్పటికీ ఫలితం కన్పించలేదని విమర్శించారు. జనవరి 2023 నాటికి పోక్సో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య 8,137 ఉన్నందున లైంగిక వేధింపులకు గురైన పిల్లలు న్యాయం కోసం 2034 సంవత్సరం వరకు వేచి ఉండాల్సి ఉంటుందని న్యాయవాది శిరీష వెల్లడించారు. బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై లైంగిక దాడులు, చిత్రహింసలు, గృహహింసలు, మహిళలపై అత్యాచారాలు లాంటి నేరపూరితమైన కేసులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటే సమాజానికి బాధితులకి న్యాయం చేకూర్చే విధంగా ఉంటుందని వారు అన్నారు. సమావేశంలో రెడ్స్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

స్పందనలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. ఈసందర్భంగా ఆయన సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన బాధితుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను విని వాటిని పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడారు.కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు దిశ డిఎస్‌పి కెవిఆర్ ప్రసాద్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, సిఐ సతీష్, స్పందన ఎస్ఐ వెంకటేశులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలు వింటున్న అధికారులు

ఇద్దరు ప్లానింగ్ సెక్రటరీలు సస్పెన్షన్

ప్లానింగ్ సెక్రటరీల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ పరిధిలోని ఇద్దరు ప్లానింగ్ సెక్రటరీలను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ సస్పెండ్ చేశారు. 'అవినీతి పట్టణ ప్రణాళిక, కలెక్షన్ ఏజెంట్లుగా ప్లానింగ్ సెక్రటరీలు' అనే శీర్షికతో పట్టణ ప్రణాళిక విభాగంలో జరుగుతున్న అవినీతిపై ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి కమిషనర్ స్పందించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 5వ వార్డ్ ప్లానింగ్ సెక్రెటరీ ప్రాస, 24 వ వార్డు ప్లానింగ్ సెక్రెటరీ జయ ప్రకాష్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం సాయంత్రం ప్లానింగ్ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ప్లానింగ్ సెక్రటరీలు తమ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. వారి పరిధిలో అక్రమ కట్టడాలు, అక్రమాలు లేఅవుట్లు, పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన అన్ని పనులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఇందులో ఏ ఒక్కరు నిర్లక్ష్యంగా వ్యవహరించిన శాఖపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రైల్వే రోడ్డు కు సంబంధించిన ప్లానింగ్ సెక్రటరీలు రోడ్డు విస్తీర్ణ పనులపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఇప్పటికే ఆక్రమణలను గుర్తించడం జరిగిందని, ఇందులో దాదాపు ఆక్రమణలు తొలగించామని చెప్పారు. ఈ రోడ్డులో మరో ఐదు భవనాలను తొలగించాల్సి ఉందన్నారు. వాటిని సైతం తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏసిపి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

'కలిసి నడుద్దాం' : వేణురెడ్డి

ప్రజాశక్తి - హిందూపురం

నియోజక వర్గ వ్యాప్తంగా ప్రతి ఒక్కరికి అన్ని వేళల అందుబాటులో ఉంటానని, అందరం కలిసి నడిచి, వచ్చే ఎన్నికల్లో వైసిపి జెండాను ఎగరవేద్దామని వైసిపి నాయకులు వేణురెడ్డి అన్నారు. సోమవారం వైసిపి నాయకులు కలుద్దాం- కలుపుకు పోదాం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా హిందూపురం రూరల్ మండలం బీరేపల్లి గ్రామంలో నాయకులందరిని కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, అప్పిరెడ్డి, చాకలి మూర్తి, గొల్ల నాగభూషణప్ప, మాజీ సర్పంచి కొండప్ప, కంబాలపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల విజేత 'పులమతి'

లేపాక్షి : మండలం పరిధిలోని పులమతి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు అండర్ -18 విభాగంలోని ఫుట్‌బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. హిందూపురంలోని ఎంజిఎంఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ అండర్ 18 విభాగంలో ఫైనల్ పోటీల్లో హిందూపురం జట్టు లేపాక్షి జట్లు తలపడ్డాయి. ఈ పోటీలో లేపాక్షి జట్టు విజేతగా నిలిచింది. బాలికల అండర్ - 18 ఫుట్బాల్ పోటీలలో వరుసగా రెండవసారి తమ జట్టు విజేతగా నిలిచినట్లు పిడి రామాంజనేయులు తెలిపారు. విజేతలను పలువురు అభినందించారు.

క్రీడాకారులకు కిట్లు పంపిణీ

కొత్తచెరువు : క్రీడాకారులు కిట్లను సద్వినియోగం చేసుకోవాలని వైసిపి మండల కన్వీనర్ జగన్ మోహన్ రెడ్డి, ఎంపీపీ గాయత్రి రెడ్డప్ప రెడ్డి, జెడ్పీటీసీ గంగాదేవి కోరారు. మండలంలో చేపట్టిన ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమంలో భాగంగా క్రీడాకారులకు అవసరమైన క్రీడా కిట్లను సచివాలయ కార్యదర్శులకు సోమవారం పంపిణీ చేశారు. మండలంలోని 13 సచివాలయాలకు గాను 15 కిట్లని పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బారన్‌సాహెబ్, ఈవోఆర్డీ సిద్దారెడ్డి, వైసిపి మండల ఉపాధ్యక్షుడు గంగరాజు, ఎంపీటీసీ రఫీ, సచివాలయ కార్యదర్శులు నరేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

డి పట్టా రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

అమరాపురం : మండలంలో ప్రభుత్వం అందించిన డి పట్టా కలిగిన రైతులు స్థానికంగా గ్రామ వాలంటీర్లను, రెవెన్యూ కార్యదర్శులను కలిసి ఈ కేవైసీ నమోదు చేసుకోవాలని తహశీల్దార్ రమేష్ బాబు కోరారు. డీ పట్టాలు ఇచ్చి 20 ఏళ్లు పూర్తి అయిన భూములను పట్టా భూములుగా మార్చడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రెండు మూడు రోజుల్లో రైతులు ఈ కేవైసీ చేయించుకోవాలని ఆయన కోరారు. మండలంలోని గ్రామ వాలంటీర్లు సంబంధిత రెవిన్యూ కార్యదర్శులకు సహకరించాలని, వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని తహశీల్దార్ రమేష్ బాబు కోరారు.

కరాటే పోటీల్లో హరీష్ స్కూల్ విద్యార్థుల సత్తా

కదిరి టౌన్ : కర్నాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్ జిల్లా గౌరీ బిదనూరులో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కదిరి హరీష్ స్కూల్ విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. ఈ మేరకు మాస్టర్ అక్బర్ అలీ మాట్లాడుతూ అబ్బాయిల వైట్ బెల్ట్ కటాస్ విభాగంలో వేమంత్, శివ, వినయ్, నాగచైతన్య, వంశీ, దీక్షిత్ గోల్డ్ మెడల్ సాధించారన్నారు. సమీర్, కార్తీక్, అస్లాం, ఖాద్రి హితేష్, నజీష్, శభాష్ సిల్వర్ మెడల్ సాధించారన్నారు. గణేష్ రెడ్డి బ్రాంచ్ మెడల్ సాధించారని తెలిపారు. అలాగే అమ్మాయిల కట్టాస్ విభాగంలో శాలిని, జ్యోతి గోల్డ్ మెడల్ సాధించగా లహరి సిల్వర్ మెడల్ సాధించిందన్నారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు కరస్పాండెంట్ కిరణ్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాన్ని మెడల్స్ ని అందజేశారు. హరీష్ స్కూల్ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా ముందు స్థానంలో ఉంటారని చెప్పారు. ఈసందర్భంగా కరాటే మాస్టర్ అక్బర్ అలీని విద్యార్థులను కరస్పాండెంట్ కిరణ్ అభినందించారు.

శ్రమకు తగ్గ వేతనాలివ్వాలి

చిలమత్తూరు : తమ శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని సచివాలయ జూనియర్ లైన్ మ్యాన్లు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏవో రామ్ కుమార్‌కు సోమవారం అందజేశారు. ప్రభుత్వం తమతో అత్యధిక శ్రమ చేయించుకుని శ్రమకు తగ్గ వేతనం ఇవ్వడం లేదని అన్నారు. శ్రమకు తగ్గట్టుగా వేతనాలు ఇవ్వడంతో పాటు తమ కుటుంబాలకు భరోసా కల్పించల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎనర్జీ అసిస్టెంట్లు మహేశ్వర్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

చిలమత్తూరు : స్థానిక బస్టాండ్ సమీపంలో పీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ పీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సహకారంతో ప్రజలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైతే ఉచితంగా వైద్యం అందించడంతో పాటు అద్దాలను అందజేస్తామని అన్నారు. సుమారు 70 మందికి పరీక్షలు నిర్వహించినట్లు నిర్వహకులు జి ఎం శేఖర్ తెలిపారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

హిందూపురం : యువ ఓటర్లు నూతనంగా పొందిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల నోడల్ అధికారి, సిరికల్చర్ ఎడి సురేష్ కుమార్, ఎంఇఒ గంగప్ప విద్యార్థులకు సూచించారు. సోమవారం పట్టణంలోని బాలాజీ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై 18 సంవత్సరాలు నిండిన వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వీరభద్రప్ప, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మతసామరస్యంపై వ్యాసరచన పోటీలు

పెనుకొండ : బాబయ్య స్వామి 751వ ఉరుసు ను పురస్కరించుకుని ప్రతి సంవత్సరము లాగే ఈ ఏడాది కూడా మతసామరస్యం పై వ్యాస రచన పోటీలను సోమవారం దర్గా పీఠాధిపతి తాజ్ బాబా ఆధ్వర్యంలో స్థానిక దర్గాపేటలోని పెద్ద పీర్ల చావిడి ,బాబా ఫక్రోద్దీన్ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ 2 సుధాకర్, షా హ్యూమెన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు షమీవుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తండాకు రోడ్డు వేయాలని వినతి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని గేమే నాయక్ తండా పంచాయతీ లో గల పోమేనాయక్ తండాకు దారి సౌకర్యం కల్పించాలని తండావాసులు కోరారు. ఈ మేరకు పోమేనాయక్ తండాకు చెందిన మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని గిరిజనులు నివసించే తండాలకు రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ మొర ఆలకించే నాయకుడే కన్పించలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో మాత్రం తమ ఓట్లను పొందడానికి అనేక హామీలతో వస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య సౌకర్యం, పిల్లల చదువులకు పాఠశాలలు, కాలేజీలకు వెళ్లడానికి రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అనారోగ్యంతో బాధపడే రోగులను తరలించడానికి కూడా 108, 104 వాహనాలు కూడా రాని పరిస్థితి ఉందని వాపోయారు. సమస్యను అనేక పర్యాయాలు ప్రజాప్రతినిధులకు అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో 300 కుటుంబాలు గల తండా ప్రజలు మొత్తం తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించామన్నారు. స్పందించిన తహశీల్దార్ సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య రాయలసీమ అధ్యక్షులు మూడే ప్రసాద్ నాయక్, రవీంద్ర నాయక్, శ్రీనివాసులు నాయక్, బాలాజీ నాయక్‌తో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు, నాయకులు

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని సిపిఐ, జనసేన నాయకులు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్లు ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అగ్రిగోల్డ్ బాధితులు ఏజెంట్లు సోమవారం పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన, దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి అంజి, జనసేన పార్టీ నాయకులు బొగ్గరం శ్రీనివాసులు, కొత్తచెరువు పూల శివ తదితరులు మాట్లాడుతూఎన్నికల ముందు బాధితులకు న్యాయం చేస్తానని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. పదివేల రూపాయలు లోపు ఉన్న బాధితులకు అరకొరగా డబ్బులు చెల్లించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కోట్ల రూపాయల విలువ చేసే అగ్రిగోల్డ్ భూములను కొంతమంది స్వాధీన పరుచుకుని బాధితులకు న్యాయం చేయకుండా కాలం గడుపుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రిగోల్డ్ ఏజెంట్లు షబ్బీర్ ఖాన్, నాగేంద్ర, నాగరాజు, మహమ్మద్ గౌస్, లక్ష్మిరెడ్డి, నాగేంద్ర, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులకు న్యాయమైన పరిష్కారం చూపించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రతి సోమవారం నిర్వహించే మండల డివిజన్ జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో అర్జీదారులకు న్యాయమైన సత్వర పరిష్కారం చూపాలని డిఆర్ఓ కొండయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని స్పందన హాల్లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ తో పాటు గ్రామ వార్డు సచివాలయాల కోఆర్డినేటర్ శివారెడ్డి, డిపిఓ విజయకుమార్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, సిపిఓ విజయ్ కుమార్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఫిర్యాదులకు అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. ప్రతి అర్జీ దారుడు సంతృప్తి చెందే విధంగా గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని ఆయన సూచించారు. స్పందన కార్యక్రమంలో 278 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, పట్టు పరిశ్రమల శాఖ జెడి పద్మమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ రషీద్ ఖాన్, ఐసిడిఎస్ పీడీ లక్ష్మీ కుమారి, సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు, బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న అధికారులు

యువగళంకు భారీ స్పందన : టిడిపి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

ప్రజాశక్తి మడకశిర

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర జనగళంగా మారిందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అన్నారు. సోమవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిప్పేస్వామి మాట్లాడారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారానికి 3000 కిలోమీటర్లు పూర్తి చేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా కోఆర్డినేటర్ బేగార్లపల్లి రవికుమార్, నాయి బ్రాహ్మణ సాధికారిక జిల్లా కన్వీనర్ రామాంజనేయులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు భక్తర్, పట్టణ కన్వనర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : సిఎం జగన్ మోహన్ రెడ్డి మాట తప్పాడని మడమ తిప్పాడని హామీలు ఎగ్గొట్టాడనిటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ విమర్శించారు. సోమవారం లోకేష్ యువగళం పాదయాత్ర 3000 కిలోమీటర్లు దాటడంతో పెనుకొండ పట్టణంలోని ఎన్ టి ఆర్ సర్కిల్ లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా సవితమ్మ మాట్లాడుతూ ఇస్తాం చేస్తాం అనడం తప్ప జగన్ చేసిందేమీ లేదన్నారు. జగన్ రెడ్డి ఉపాధ్యాయులను ఆత్మహత్య చేసుకునే వరకు తీసుకొచ్చారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం కల్పించిన అన్ని అడ్డంకులను అధిగమిస్తూ ప్రజలే సైన్యంగా యువగళం పాదయాత్ర 3000 కిలోమీటర్ల మైలురాయికి చేరిందన్నారు. యువగళం పాదయాత్రతో వైసిపిలో వణుకు పుడుతోందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎన్ని జిమ్మికులు చేసినా ప్రజలు నమ్మరని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్రకు విశేష స్పందన లభిస్తోందనికుంచిటి ఒక్కలిగా రాష్ట్ర కన్వీనర్ వివిం. పాండురంగప్ప తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర 3వేల కిలోమీటర్లు పూర్తి చేసుకుందన్నారు.

పుట్టపర్తి క్రైం : టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 3వేలకిలోమీటర్లు పూర్తి అయిన సందర్భంగా టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. సోమవారం పట్టణంలోని సత్తెమ్మ గుడి సర్కిల్ లో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఆ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అమ్మినేని కేశవ నాయుడు, మాజీ సింగల్ విండో ప్రెసిడెంట్ ఆవుల సుబ్రహ్మణ్యం, బీసీ నాయకులు దయ్యాల ఉమాపతి, నారాయణప్ప, మైనార్టీ కొల్లాయప్ప పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి మడకశిర

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి పట్టణ అధ్యక్షులు మనోహర్, మైనార్టీ సెల్ అధ్యక్షులు భక్తర్‌సాబ్ అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఐదవ వార్డులో చేపట్టిన బాబుష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి టిడిపి రూపొందించిన ఆరు గ్యారెంటీలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీరప్ప, తిమ్మరాజు, రవికుమార్, రమేష్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మినీ మేనిఫెస్టో కరపత్రాలు అందజేస్తున్న టిడిపి నాయకులు

పరిగి : రాబోయే ఎన్నికల్లో మార్పు తథ్యమని మాజీ ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. సోమవారం పరిగి మండలంలోని పెద్దరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే అమలు పరిచే పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహయ్య, లక్ష్మిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, గోపీ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : మండలంలోనిగుండుమల పంచాయతీ కెఎస్ తండాలో మాజీ సర్పంచి చంద్రప్ప ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి టిడిపి ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్ కన్న, తిగలప్ప, లోకేశ్ నాయక్, గోవిందనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఎస్టీ ధ్రువీకరణ పత్రాలపై విచారణ చేయాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

కొంతమంది ఎస్సీ, ఎస్టీ నకిలీ ధ్రువపత్రాలు పొందారని వాటిపై జిల్లా అధికారులు విచారణ చేపట్టాలని ఏపీ ఎరుకుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎరుకుల శంకరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్ఓ కొండయ్యకు సోమవారం సమర్పించారు. హిందూపురం ప్రాంతంలో తూము కుంట చెక్ పోస్ట్ సమీపంలో ఉన్న నకిలీ ఎరుకుల కుటుంబాలకు ఇచ్చిన ఎరుకుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నకిలీ ధ్రువపత్రాలను పంపిణీ చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పగటివేషగాళ్లు అనే కుటుంబాలు తప్పుడు ఎరుకుల కుల ధ్రువీకరణ పత్రాలు పొందారని పూర్తిస్థాయిలో విచారణ చేస్తే వాస్తవాలు బయటపడతాయని అన్నారు. ఎస్టీకి సంబంధించిన భాష కాని ఇతర సాంప్రదాయాలు కానీ తెలియని వారికి అక్కడి వీఆర్వో ద్వారా తహశీల్దార్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారని అన్నారు. జిల్లా అధికారులు సమగ్రంగా విచారణ చేసి బాధ్యులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఏపీ ఎరుకుల సంఘాల తరపున పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

చిన్నారులతో కలసి నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పరిగి బస్టాండ్ ఆక్రమణలపై చర్యలు చేపట్టండి

కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని పరిగి బస్టాండులో టోకు కూరగాయల వ్యాపారులు మున్సిపల్ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా షెడ్లను నిర్మాణం చేసుకున్నారని, వీరిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి కౌన్సిలర్లు మునిసిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ కోరారు. వేలం వేయకుండానే స్థలాల కేటాయింపు అని శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి టిడిపి కౌన్సిలర్లు స్పందించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ ను కలిసి సమస్యపై చర్చించారు. దీంతో పాటు ట్రేడ్ లైసెన్స్‌ల విషయంలో సైతం మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ టోకు వ్యాపారులకు గతంలో 18 మందికి కేటాయిస్తూ కౌన్సిల్ ఆమోదం తెలపడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి జిల్లా గెజిట్ మేరకు బహిరంగ వేలం వేసి వారికి కేటాయిస్తామన్నారు. అయితే అప్పటికే గుర్తించిన స్థలంలో టోకు వ్యాపారులు షెడ్ల నిర్మాణం చేసుకున్నారని, దీనిపై మున్సిపల్ యాక్ట్ మేరకు ఆక్రమణల పన్నును వసూలు చేయడం జరిగిందని చెప్పారు. టిడిపి కౌన్సిలర్లు 24 మంది షెడ్ల నిర్మాణం చేసుకున్నారని తెలపడంపై, కమిషనర్ మాట్లాడుతూ ట్రేడ్ లైసెన్స్ ల విషయంలో మున్సిపల్ నిబంధనల మేరకే ముందుకు పోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్లు రమేష్ కుమార్, రాఘవేంద్ర, సతీష్ కుమార్, నాయకులు దుర్గ నాని, హరి తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై విద్యార్థులకు అవగాహన

కొత్తచెరువు : దిశ యాప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ సురేష్ బాబు కోరారు. స్థానిక సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఐ సురేష్‌బాబు దిశయాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళి, అధ్యాపకులు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల మనోహర్ అరెస్టు అమానుషం

కదిరి టౌన్ జనసేనపార్టీ నాయకులు నాదెండ్ల మనోహర్‌ను విశాఖ పట్టణంలో హోటల్ నుంచి బయటకు రాకుండా పోలీసులు నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆపార్టీ కదిరి ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్టణం ఎంపీ నిర్మిస్తున్న ఒక అపార్ట్‌మెంట్ కు వాస్తు ప్రకారం రోడ్డు ఉండకూడదని, టైకూన్ జంక్షన్ రోడ్ మూసివేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఉన్న రోడ్లను మూసివేస్తే ప్రజలు ఏలా వెళ్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రజాసమస్యలపై ప్రతిపక్ష పార్టీలు పోరాటం చేస్తే పోలీసుల ద్వారా అడ్డుకోవాలని చూస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు రవికుమార్, రవీంద్ర నాయక్,కిన్నెర మహేష్, న్యాయవాది రవీంద్ర, చెక్క రమణ, గంగరాజు, వంశీ, బాలాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి

గాండ్లపెంట : పెండింగ్ కేసుల పరిష్కారానికి దృష్టిసారించాలని కదిరి డీఎస్పీ శ్రీలత ఆదేశించారు. ఈ మేరకు ఆమె సోమవారం స్థానిక పోలీస్ స్టేషను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు పెండింగ్ లో ఉన్న కేసులు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ఎస్ఐ వెంకటనారాయణకు సూచించారు. అనంతరం సోమయాజులపల్లి పంచాయతీలోని దళితవాడలో మహిళలపై హింస, బాల్యవివాహాలు చట్టాల పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ వెంకటేశ్వర్లు, జమేదార్ రామయ్య, శ్రీనివాసులు, భాస్కర్ రాజు, గురు ప్రసాద్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని 200 రోజులకు పెంచాలి

కదిరి టౌన్ : కరువు ప్రాంతంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనిదినాలను కూలీలకు 200 రోజులకు పెంచాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు .ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షానవాజ్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో వంశీకృష్ణకు సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి దొరకక ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారన్నారు. కరువు నివారణ కొరకు ఉపాధి హామీ పనులను ప్రతి గ్రామంలోనూ ప్రారంభించాలని కోరారు. కదిరి నియోజకవర్గంలో ఆరు మండలాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనిని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కదిరప్ప, మునికుమార్, నాగేంద్ర, పవన్ కుమార్, ఉపేంద్ర, హైదర్ వలీ, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను మోసం చేసిన జగన్ : బికె

పెనుకొండ : జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో సిపిఎస్ రద్దు చేసి, ఇపిఎస్ అమలు చేస్తామని హామీ ఇచ్చి 5ఏళ్ళు కావస్తున్న అమలు చేయలేదని,ఉద్యోగులను, ఉపాధ్యాయులను మోసం చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గం ఇన్‌ఛార్జి బికె. పార్థసారథి విమర్శించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులకు నెల వేతనాలు ఎప్పుడు వేస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. పెన్షనుదారుల పరిస్థితి మరి ఘోరంగా తయారైందన్నారు. ఉరవకొండ ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయుడు మల్లేష్ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడం చాలా బాధాకరం అన్నారు. జగన్మోహన్ రెడ్డి అనాలోచిత చర్యల వల్ల ఉద్యోగుల, ఉపాధ్యాయుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని అన్నారు.

వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

కదిరి టౌన్ : సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఐక్యవిద్యార్థిసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కదిరి పట్టణంలో ఐక్య విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో సోమవారం జీపు యాత్రను చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికై చేపట్టిన జీపు జాతా కదిరి నుండి ప్రారంభమై ధర్మవరం, పెనుగొండ, మడకశిర, హిందూపురం, గోరంట్ల, మీదుగా పుట్టపర్తి లో ముగుస్తుందన్నారు. ఈసందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు నేరుగా విద్యార్థుల దగ్గరకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిరంజన్ యాదవ్, నరసింహ, పోతలయ్య, సాయికుమార్, రాజేష్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

జీపుజాతాలో మాట్లాడుతున్న నాయకులు

మల్లేష్‌కు యుటిఎఫ్ పరామర్శ

మడకశిర : ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మల్లేష్‌ను యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు భూతన్న పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోరాటాలతోనే హక్కులను సాధించుకోగలమన్నారు. ఉపాధ్యాయులు పోరాటాలకు సంసిద్ధులు కావాలని కోరారు.

అంతర్ కళాశాల అథ్లెటిక్ పోటీల్లో

ఎస్‌డిజిఎస్ కళాశాల విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయ పరిధిలో నిర్వహించిన అంతర్ కళాశాల అథ్లెటిక్ పోటీలలో పట్టణంలోని ఎస్ డి జి ఎస్ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ఆ కళాశాల కార్యదర్శి బైసాని రాంప్రసాద్ తెలిపారు. పోటీలలో సత్తా చాటిన విద్యార్థులకు ప్రిన్సిపల్ జెఎస్‌వివిఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో అభినందన సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఈ నెల 8,9 తేదీలలో ఎస్కే యూనివర్సిటీలో జరిగిన అథ్లెటిక్ పోటీలలో ఎస్‌డిజిఎస్ కళాశాల విద్యార్థులు 25 మెడల్స్ సాధించారన్నారు. అథ్లెటిక్ పోటీలలో ద్వితీయ సంవత్సరం బిబిఎ చదువుతున్న బి మేఘన ఉమెన్స్ ఛాంపియన్‌షిప్ సాధించడం కళాశాలకే గర్వ కారణం అన్నారు. ఈమెతో పాటు ఈ పోటీలలో పాల్గొని గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు కళాశాల కమిటీ అధ్యక్షులు రేవూరి చంద్రమోహన్, ఉపాధ్యక్షులు దాస వీ సురేష్, ట్రెజరర్ నందకిషోర్, ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగేంద్ర కుమార్, ఎన్‌సిసి ఆఫీసర్ ఎంఆర్ ఫణీంద్ర, ఫిజికల్ డైరెక్టర్ వై హేమంత్ కుమార్, ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ అశ్వర్థనారాయణ, తదితరులు అభినందించారు.

హంద్రీనీవా నీరు పుంగనూరుకు తరలింపు అన్యాయం

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి నియోజకవర్గానికి కేటాయించిన మూడు టిఎంసిల హంద్రీనీవా నీటిని పుంగనూరు తరలించడం అన్యాయమని టిడిపి అధికార ప్రతినిధి మారుతి రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన సోమవారం పుట్టపర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో నీరు లేక రైతులు అల్లాడిపోతున్నారన్నారు. బుక్కపట్నం చెరువును 0.5 టీఎంసీతో నింపి, మిగతా 193 చెరువులు నింపి తర్వాత చిత్తూరుకు నీటిని తరలించుకోవాలని ప్రభుత్వం జీవో జారీ చేసిందని స్పష్టం చేశారు. కాని దీనిని కాలరాస్తు పుంగనూరుకు తరలించడం ఏంటని ప్రశ్నించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగునూరుకు మాత్రమే మంత్రా, రాష్ట్రానికి కాదా? అని మారుతీ రెడ్డి ప్రశ్నించారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి హంద్రీనీవా నీటితో బుక్కపట్నం చెరువుతో పాటు 193 చెరువులు నింపాలని కోరారు. లేదంటే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికే

'గడపగడపకూ మన ప్రభుత్వం'

పుట్టపర్తి రూరల్ : ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టామని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం పుట్టపర్తి మండల పరిధిలోని దిగవ చెర్లోపల్లి సచివాలయ పరిధిలో గల దిగువ చెర్లోపల్లి, గంగిరెడ్డిపల్లి, సాతార్లపల్లి, గంగిరెడ్డిపల్లి తండాలో పర్యటించారు. ఈసందర్భంగా గడపగడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని అధికారుల ద్వారా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీ నరసమ్మ, ఎంపీపీ రమణారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ నరసారెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ గంగాధర్, గంగిరెడ్డిపల్లి నాయకులు, ఎంపీటీసీలు, గృహసారథులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.